ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 03.03.2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్ ఎల్ బి సి సొరంగంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల వద్దకు చేరుకొనేందుకు రోబోలను వినియోగించనున్నారు.
2. రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ను కేంద్ర ఎన్నికల సంఘం ఈ రోజు విడుదల చేసింది.
3. బీజేపేతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం సహకరించడం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు.
4. ఈనె 8న మహిళలకు నెలకు 2 వేల 500 రూపాయలు పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయకపోతే పోస్టు కార్డుల ఉద్యమం ప్రారంభిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

**ఎస్ఎల్‌బీసీ**

నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్ ఎల్ బి సి సొరంగంలో చిక్కుకున్న 8 మంది కార్మికులను రక్షించేందుకు రోబోలను భాగం వినియోగించనున్నారు. 10 రోజులుగా ఈ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నిన్న టన్నెల్ ను సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో సహాయక చర్యలకు తగిన రోబోలను తీసుకొచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేపడుతున్నారు. 11 బృందాలతో నాలుగు షిఫ్టులో రక్షణ చర్యలు చేపడుతున్నారు. TBM పరికరాల శిథిలాలను ప్లాస్మా కటింగ్ చేపట్టి తొలగిస్తున్నారు. కన్వేయర్ బెల్ట్ ను ఈరోజు రాత్రి లోగా పునరుద్ధరించేందుకు రక్షణ బృందాలు శ్రమిస్తున్నాయి. టన్నెల్ లో రెండు మీటర్ల లోతులో నలుగురి కార్మికులకు సంబంధించిన ఆనవాళ్లను రాడార్లు,

స్కానింగ్ యంత్రాల ద్వారా గుర్తించారు. మరో నలుగురు 8 మీటర్ల లోతులో ఉన్నట్లుగా గుర్తించారు. రోబోల సాయంతో సహాయక చర్యల్లో మరింత పురోగతి కనిపిస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**PTC, నాగర్‌కర్నూల్ జిల్లా**

**ఎమ్మెల్సీ నోటిఫికేషన్**

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ను కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేసింది. ఈరోజు నుంచి ఈనెల 10 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఈనెల 11న నామినేషన్లు పరిశీలిస్తారు. మార్చి 13 వ తేది వరకు నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉంది. 20వ తేదీన పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. శాసనమండలి సభ్యులు మహమూద్ ఆలీ , సత్యవత రాథోడ్ , శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్‌ల పదవీకాలం త్వరలో ముగినుండటంతో ఈ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం శాసనసభలో పార్టీలకున్న సంఖ్యా బలాన్ని బట్టి అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటీ నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో సైతం 5 స్థానాల్లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు కూడా నోటిఫికేషన్ జారీ అయింది.

**డెస్క్**

--------------------------

**ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్**

మరోవైపు గత నెల 27న రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ ఉదయం ప్రారంభమైంది. ఉమ్మడి కరీంనగర్- మెదక్ – నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల నియోకవర్గంతో పాటు ఉపాధ్యాయ నియోజకవర్గానికి కరీంనగర్లో

అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ – ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి నల్గొండలోని FCI గోదాములో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కరీంనగర్ కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన బందోబస్తు వివరాల గురించి పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆకాశవాణికి తెలియజేస్తూ..

**----------- సౌండ్ బైట్ -----------**

**డెస్క్, కరీంనగర్, నల్గొండ**

----------------------------

తుమ్మల

బీజేపీ ఏతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం సహకరించడం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలంలో మంత్రి పర్యటించారు. కుమ్మరి గూడెం వద్ద దుమ్ముగూడెం ఆనకట్టను మంత్రి తుమ్మల పరిశీలించారు. ఆదాయం కేటాయింపులో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని అన్నారు. పన్నుల రూపంలో రాష్ట్రం రూపాయి చెల్లిస్తే 42 పైసలు మాత్రమే తిరిగి ఇస్తున్నారని విమర్శించారు.

**డెస్క్**

------------------------

**పొన్నం - గడ్కరీ**

తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖలోని వివిధ అంశాలపై రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాసిన లేఖకు కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. 2.5 కోట్ల జనాభాకు ఒక డ్రైవింగ్ శిక్షణ , పరిశోధన సంస్థ - ఐడీటీఆర్ కి మాత్రమే అర్హత ఉంటుందని ,

ఇప్పటికే కరీంనగర్లో ఒక ఐటీడీఆర్ పని చేస్తోందని తెలిపారు. ఈ మేరకు పొన్నంకు గడ్కరీ లేఖ రాశారు.

**డెస్క్**

-----------------------

**ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన**

పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం అయ్యేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. కృష్ణా నీటి కేటాయింపులు , ప్రాజెక్టులకు సంబంధించి అంశాలపై మధ్యాహ్నం కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. అనంతరం గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమవుతారు.

**డెస్క్**

---------------------

**ఎమ్మెల్సీ కవిత**

మార్చి 8న ప్రపంచ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలకు నెలకు 2 వేల 500 రూపాయలు పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయకపోతే పోస్టు కార్డుల ఉద్యమం ప్రారంభిస్తామని బీఆర్ఎస్ MLC కవిత తెలిపారు. హైదరాబాద్ లో ఈరోజు జాగృతి నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. మహిళల సాధికారతకు తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. మున్సిపాలిటీలు , ఇతర ప్రాంతాలలో పనిచేస్తున్న మహిళా కార్మికుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకపోవడంతో అనేక మంది యువతులు చదువుకు దూరమవుతున్నారని అన్నారు. వరంగల్ లో నిర్మించనున్న మామునూరు విమానాశ్రయానికి రాణి రుద్రమ దేవి పేరు పెట్టాలని MLC కవిత డిమాండ్ చేశారు.

డెస్క్

-------------------------

**కులగణన**

ఈ నెల 7న కులగణనపై ఆదీవాసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఒక సమావేశం నిర్వహించనున్నట్లు గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ తెలిపారు. కులగణన అంశంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి , బండి సంజయ్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను అణగదొక్కేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని అన్నారు.

డెస్క్

----------------------

**భేటీ బచావో**

భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ' అనే అంశంపై నిర్మల్ జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి సంక్షేమ శాఖ అధికారి ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు , వసతి గృహాల్లో అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆకాశవాణికి ఫైజాన్ అహ్మద్ వివరించారు.

**----------సౌండ్ బైట్-------------**

**పిటిసి నిర్మల్ జిల్లా**

------------------------------

**వన్యప్రాణుల దినోత్సవం**

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. ఈ రోజు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని జైనూరు మండల కేంద్రంలో కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులతో పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. వాటి సంరక్షణ కోసం అటవీ అధికారులతో ప్రజలు కలిసి రావాలని కోరారు.

**ఆసిఫాబాద్ జిల్లా పిటిసి**

------------------------

**ఆరోగ్య శిబిరం**

ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్ మండల కేంద్రంలో జిల్లా అటవీశాఖ , సింగరేణి సంస్థ సంయుక్తంగా రేపటి నుంచి రెండు రోజుల పాటు ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నాయి. ఈ శిబిరంలో వైద్య సేవలు సహా కీళ్ల, స్త్రీల వైద్య నిపుణులు సేవలు అందిస్తారని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత పరీక్షలతో పాటు , ఔషధాలు కూడా అందించనున్నట్లు తెలిపారు.

**ఆసిఫాబాద్ జిల్లా పిటిసి**

------------------------

**నీటి విడుదల**

రాజన్న సిరిసిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద గల శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. దిగువన ఉన్న ఎల్ఎండీ జలాశయానికి 2500 , కుడి కాలువకు 450 , ఎడమ కాలువకు 5 క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.

**పీటీసీ, రాజన్న సిరిసిల్ల**

------------------------

**యాదాద్రి**

పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు నుంచి అలంకార సేవలు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం మత్స్యావతార అలంకారంలో భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. నిన్న రాత్రి జరిగిన విశేష పూజలలో భేరిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు

**పిటిసి, నల్లగొండ జిల్లా**